క్లుప్తంగా

విత్తన గుళికల తయారీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: విత్తన గుళికల తయారీపై సోమరాజుపేట గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎల్–2 గౌరీశ్వరరావు, సురేష్ మంగళవారం అవగాహన కల్పించారు. కందులు, మినుములు,పెసలు, జొన్నలు, సజ్జలు, అలసందలు, మొక్కజొన్న తదితర రకాల విత్తనాలను మట్టిలో కలిపి గుళికలుగా తయారు చేసుకోవాలన్నారు. ముందుగా విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేసుకోవాలని చెప్పారు. విత్తనగుళికలను పొలాల్లో వెదజల్లితే వర్షాలకు మొలకెత్తుతాయని వివరించారు.వీఏఏ అసిరినాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బి.రమాదేవి, జి.సింహాచలం, కె.పార్వతి, పి.గౌరీశ్వరరావు,పైల తవిటినాయుడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

13న మండల సర్వసభ్య సమావేశం

బాడంగి: మండల సర్వసభ్య సమావేశం ఈనెల13వ తేదీన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగిగౌరి అధ్యక్షతన ఉదయం 11గంటలకు ప్రారంభం కానున్న ఈ సమా వేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆధార్ కేంద్రం పరిశీలన



ఆధార్ సెంటర్లో సేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్ను ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ కేంద్రాల్లో ఆధార్ అప్డేట్తో పాటు మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఈసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే ఇంకా ఆధార్ కార్డులు లేని చాలా మంది గిరిజనులు ఉన్నా రని, వారందరినీ క్షేత్రస్థాయిలో గుర్తించి ఆధార్ కార్డులను జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించ నున్నట్లు తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామారావు, కొంపంగి సర్పంచ్ వెంకటరమణ,పంచాయతీ కార్యదర్శి జి.కృష్ణ ఉన్నారు.

ఏపీఎంసీ కమిటీ సభ్యుడిగా డాక్టర్ అప్పారావు



బొబ్బిలి: ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు కె.వి.అప్పారావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఏపీ ఎంసీ రిజిస్ట్రార్ డాక్టర్ ఐ.రమేష్ మంగళవారం నియామక ఉత్తర్వులు పంపారు. దీంతో స్థానికులు డాక్టర్ అప్పారావుకు శుభాకాంక్షలు తెలిపారు.

యోగాతో బహుళ ప్రయోజనాలు



రేగిడిలో యోగా చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది

సంతకవిటి: నిత్యం యోగా చేయడం ద్వారా బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని ఎంపీడీఓ కె.సురేష్కుమార్ అన్నారు.యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం సంతకవిటితో పాటు మామిడిపల్లి గ్రామంలో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు.మండల అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, యువత, ప్రజలు పాల్గొన్నారు.

రేగిడి: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజలు మంగళవారం యోగాసనాలు వేశారు. ఎంపీడీఓ శ్యామలాకుమారి మాట్లాడుతూ నిత్య జీవితంలోయోగా ఓ భాగం కావాలని అన్నారు. ముందుగా ర్యాలీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఓలు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వయంశక్తి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

12న వంగరలో ర్యాలీ

వంగర: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో నిర్వహించనున్న అవగాహన ర్యాలీ, యోగాసనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమానికి రిజిస్ట్రేషన్లు పెంచాలన్నారు. ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, వైద్యాధికారి సీహెచ్.జ్యోతి, ఏపీఎం టి.మంగమ్మ పాల్గొన్నారు.

గౌరవ వేతనమేది...?



రాజాం మండల పరిషత్ కార్యాలయం

రాజాం నియోజకవర్గంలో ఎంపీటీసీ సభ్యుల వివరాలు	
మండలం	ఎంపీటీసీ సభ్యులు
రాజాం	14
రేగిడి	18
సంతకవిటి	18
వంగర	13

- ఎంపీటీసీ సభ్యులకు 20 నెలలుగా అందని గౌరవ వేతనం
- నిధులు విడుదల చేయకుండా తాత్సారం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- నియోజకవర్గంలో 63 మంది ఎంపీటీసీలకు అందని వేతనాలు

రాజాం:

స్థానిక సంస్థలను రాష్ట్రంలోని టీడీపీ కూటమి సర్కారు నిర్వీర్యం చేస్తోంది. అధికంగా వైఎస్సార్ సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులు,పార్టీ నాయకు లే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులుగా ఉన్నారు. దీంతో వారిపై అక్కసుతో వ్యవహరిస్తోంది. మండలపరిషత్ సర్వసభ్య సమావేశాల్లో తీర్మానాలకు ప్రాధాన్యత లేకుండా చేస్తున్న ప్రభుత్వం... గత 20 నెలలుగా ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాన్ని కూడా అందకుండా చేస్తోంది.

కావాలనే...

స్థానిక సంస్థలకు సంబంధించి పంచాయతీ సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులకు గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్రెడ్డి గౌరవ వేతనాన్ని అమలు చేశారు. సర్పంచ్కు నెలకు రూ.3వేలు, ఎంపీటీసీ సభ్యులకు నెలకు రూ.3 వేలు చొప్పున గౌరవ వేతనాన్ని అందించేవారు. సర్పంచ్లకు ఆయా పంచాయతీల ఖాతాలకు ఈ గౌరవ వేతనాలు జమవుతుంటాయి. ప్రతీ ఏడాది అభివృద్ధి నిధుల్లో వీటిని తీసేందుకు కూడా వీలుంది. ఎంపీటీసీ సభ్యులకు మాత్రం ప్రభుత్వం మండల పరిషత్కు ప్రత్యేకంగా గ్రాంట్ ఇవ్వాలి. ఈ బడ్జెట్ నుంచి నిధులు తీసి వేతనాలు చెల్లించాలి. స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం రెండు నుంచి మూడు పర్యాయాలు ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు అందించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ పేరుతో గౌరవ వేతనాలు విడుదలకాకుండా కూటమి నేతలు అడ్డుకున్నారు. అనంతరం కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇంకా గౌరవ వేతనాలకు నిధు లు విడుదల చేయలేదు. కావాలనే ఈ ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, వెంటనే గౌరవ వేతనాలు అందించాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

తగ్గిన గౌరవం

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం హయాంలో స్థానిక సంస్థల సర్పంచ్లు, ఎంపీటీసీలకు గౌరవం ఉండేది. గ్రామ సచివాలయాల దగ్గర నుంచి మండల కార్యాలయా ల్లో ప్రతీచోట ప్రజా ప్రతినిధులను అధికారులు గుర్తించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిందని పలువురు ప్రజా ప్రతినిధులు మండిపడుతున్నారు. కొన్నిచోట్ల గ్రామ సచివాలయాల్లో సర్పంచ్లకు కేటాయించిన కుర్చీల్లో టీడీపీ కార్యకర్తలు కూర్చుంటున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పలు సచివాలయాల్లో ఉద్యోగులు సర్పంచ్లు, ఎంపీటీసీలు వారి దృష్టికి తెస్తున్న చిన్న చిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదని వాపోతున్నారు. గతంలో ఉన్న గౌరవం ఇప్పుడులేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోవడంలేదు



ఎంపీటీసీ సభ్యులకు ఎంతో గౌరవం ఉంటుంది. మండల పరిషత్ అభివృద్ధిలో ప్రధాన పాత్ర ఉంటుంది. అటువంటి ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు సక్రమంగా అందించడంలేదు. గతంలో సకాలంలో అందేవి. ఇప్పుడు 20 నెలలుగా పెండింగ్లో ఉన్నాయి. ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు.

– కనకల సన్యాసినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు, తాలాడ, సంతకవిటి మండలం

20 నెలలుగా ఇవ్వలేదు



గత 20 నెలలుగా మాకు గౌరవ వేతనాలు ఇవ్వలేదు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలకు సంబంధించి బిల్లులు పెట్టగా మంజూరయ్యాయి. అయితే ఎన్నికల కోడ్ అని ఆ నిధులను ఆపేసారు. తర్వాత కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని మంజూరు చేయలేదు. ప్రభుత్వం కాలయాపన చేస్తోంది.

– యాలాల సునీత, వైస్ ఎంపీపీ రాజాం మండలం.

తీర్మానాలు చేశాం



ఎంపీటీసీ సభ్యులకు మండలపరిషత్ బడ్జెట్ నుంచి గౌరవ వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. వీటికి తీర్మానాలు చేశాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే ఎంపీటీసీ సభ్యుల ఖాతాల్లో జమచేస్తాం.

– వి. శ్రీనివాసరావు, ఎంపీడీఓ, రాజాం

రాష్ట్రంలో అరాచక పాలన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- కొమ్మినేని అరెస్టు దుర్మార్గం
- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, తాను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పని చేశానని, ఇటువంటి అరాచకాలను తానెప్పుడూ చూడలేదని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజావ్యతిరేక విధానాలను, ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తుందన్న అక్కసుతోనే సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడడం దుర్మార్గమని మండిపడ్డారు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం నీచమైన చర్యగా పేర్కొన్నారు.రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ అక్రమ అరెస్టులు చేయిస్తున్నారన్నారు. చంద్రబాబుకు తన సొంత బావమరిది మహిళలను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలు వినిపించలేదా అని ప్రశ్నించారు.చర్చా గోష్టిలో విశ్లేషకుడు కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలతో తమకే మాత్రం సంబంధం లేదని సాక్షి యాజమాన్యం ఖండించినా ఆ సంస్థ కార్యాలయాలపై టీడీపీ గూండా మూకలు దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రెడ్బుక్ పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.చేతనైతే ప్రజల నుంచి ఏ విమర్శ లేకుండా ఇచ్చిన హామీలను అమలు చేయాలే తప్ప ఇలాంటి అరాచకపాలన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారన్నారు.ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, ,నియోజకవర్గ వైఎస్సార్సీపీ రైతు విభాగం అధ్యక్షుడు నడిమింటి సత్యనాయుడు, సీనియర్ నాయకుడు కనిమెరక అప్పారావు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

విద్యారంగ హామీల అమలులో విఫలం



మానవహక్కుల వేదిక కన్వీనర్ జోగినాయుడు

బొబ్బిలిరూరల్: ప్రభుత్వ విద్యారంగానికి సంబంధించి టీడీపీ కూటమి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయ్యిందని మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్ బంకురు జోగినాయుడు విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యారంగాన్ని ఉద్ధరిస్తానని తన పాదయాత్రలో లోకేష్ పదేపదే చెబుతూ, అనేక హామీలిచ్చారని, తీరా విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత వాటి ఊసే లేకుండా పోయిందన్నారు. 117 జీఓను నేటికీ రద్దుచేయలేదన్నారు. 4వేల స్కూల్ అసిస్టెంట్లు, 25వేలు ఎస్జీటీ పోస్టులు రద్దయ్యాయని వాటి హేతుబద్ధీకరణకు అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారన్నారు.తెలుగు మీడియంను పునరుద్ధరించి ఉంటే ఈ సమస్యలు ఉత్పన్నమయ్యేవి కావని పేర్కొన్నారు.విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఎస్జీటీలను నియమిస్తామని చెప్పి మాటతప్పారని మండిపడ్డారు.సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నత పాఠశాలలకు 4వేలమంది స్కూల్ అసిస్టెంట్లను పంపి పదోన్నతులు ఇస్తున్నట్లు బుకాయిస్తున్నారని ఆరోపించారు. ఎస్జీటీలకు పదోన్నతులు, తెలుగుమీడియం పునరుద్ధరణ ద్వారానే సమస్య తీరుతుందని, వెంటనే ప్రభుత్వం ఆదిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నరికేసి..వదిలేశారు..!



తెర్లాం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి జంక్షన్ వరకు ఆర్అండ్బీ రోడ్డును ఆనుకుని కొత్తగా విద్యుత్ లైన్ వేసేందుకు రోడ్డు పక్కన ఉన్న చెట్లను విద్యుత్శాఖ అధికారులు ఇటీవల పూర్తి గా నరికివేయించారు. వాటిని తొలగించకుండా అలాగే రోడ్డుపై వదిలేయడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈరోడ్డులో ఇలా చెట్లు దుంగలు, కొమ్మలను నరికేసి వదిలేయడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీటిని తొలగించాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

– తెర్లాం

గోడౌన్గా పాఠశాల భవనం



రాజాం మండలంలోని రామానుజలపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాల మూతపడింది. దీంతో పాఠశాల భవనాన్ని స్థానికులు కొందరు గోడౌన్గా వాడుకుంటున్నారు. ధాన్యం బస్తాలు, సిమెంట్, ఇతర సామగ్రిని భద్రపరుచుకునేందుకు వినియోగిస్తున్నారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రానికి సొంత భవనం లేక పోవడంతో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. కానీ ఖాళీగా ఉన్న పాఠశాల భవనాన్ని అంగన్వాడీ కేంద్రంగా వినియోగించుకునే ఆలోచన అధికారులు చేయక పోవ డం శోచనీయం. అధికారులు స్పందించి ఈభవనాన్ని అంగన్వాడీ కేంద్రానికి కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– రాజాం

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా..?



ఈ ఫొటోలో కనిపిస్తున్నది అంతర్రాష్ట్ర రహదారి. ఈ రోడ్డులో నిత్యం ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈరోడ్డులో తెర్లాం మండలం ఎం.ఆర్ అగ్రహారం, మెరకముడిదాం మండలంలోని ఉత్తరావల్లి మధ్య సుమారు కిలో మీటరుపైనే రోడ్డంతా పూర్తిగా గోతులు తేలి అధ్వానం గా తయారైంది. వాహన చోదకులు, ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. గోతుల వల్ల ద్విచక్ర వాహన చోదకులు అదుపు తప్పి పడిపోతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రోడ్డులో కొంత భాగం మాత్రమే మరమ్మతులు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

– తెర్లాం

డిబేట్లపై రాద్ధాంతాలు, నిరసనలు సరికాదు



వేమిరెడ్డి లక్ష్మునాయుడు

బొబ్బిలి: టీవీ చానళ్లలో డిబేట్లు నిర్వహించడం, వాటిలో పాల్గొనే విశ్లేషకులు వారి వారి అభిప్రాయాలతో, వాక్ స్వాతంత్ర్యాన్ని వెల్లడిస్తారని, దానికోసం ఆరుబయట రాద్ధాంతాలు, నిరసనలు అవసరమా అని ఉత్తరాంధ్ర సాధన సమితి వ్యవస్థాపక కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. బొబ్బిలిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజధాని అమరావతిపై గత కొన్ని సంవత్సరాలుగా డిబేట్లు నడుస్తున్నాయన్నారు. ఆ కోవలోనే సాక్షి చానల్లో కూడా డిబేట్ జరిగితే మాట్లాడిన వారు క్షమాపణ చెప్పినా సరే దీన్ని వివాదాస్పదం చేయడం దారుణమన్నారు. ఏకంగా డిబేట్ నిర్వాహకులను అరెస్టు చేయడం ఎంత వరకూ సబబని ప్రశ్నించారు. గతంలో ఈటీవీ, టీవీ–5, ఏబీఎన్ వంటి ఎన్నో చానళ్లలో ఎంతో మంది తమకు నచ్చిన వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. కొన్ని చానళ్లలో చెప్పులతో కొట్టుకోవడం, వ్యక్తిగత విమర్శలకు దిగడం చూశామన్నారు. కానీ డిబేట్లు నిర్వహించిన చానల్పైనా, కార్యాలయాలపైనా ఎవరూ భౌతిక దాడులకు దిగలేదన్నారు. సంస్థకు చెందిన పత్రికపైనా నేరాలు, ఘోరాలు ఆపాదించడం సరికాదన్నారు. ఇది కేవలం రాజకీయ కక్షే తప్ప మరోటి కాదని ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. రాజకీయాలు చేసుకుంటే పార్టీ పరంగా చేసుకోవాలే కానీ ఇలా సంస్థలపై భౌతిక దాడులకు దిగడం న్యాయం కాదన్నారు. గతంలో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలోకి చొరబడడం ఓ సంచలనమైతే, ఇప్పుడు సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు మరో భారీ కుట్రని అనడంలో సందేహం లేదన్నారు.

ఎస్ఎస్ చానల్లో పూడిక తొలగింపు

వంగర: మండలంలోని కె.కొత్తవలస గ్రామం నుంచి పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పదమాయవలస, చాకరాపల్లి వరకు ఎస్ఎస్ చానల్లో పూడిక,జంగిల్ తొలగింపు పనులు చేపడుతున్నామని ఇరిగేషన్ ఏఈ డి.వి.రమణ మంగళవారం తెలిపారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన రూ.13లక్షల నిధులతో ఈ పనులు చేపడుతున్నామని ఏఈ స్పష్టం చేశారు.

అడ్డగోలు పదవికి మరో అవిశ్వాసం

బొబ్బిలి: వైఎస్సార్ సీపీకి ఉన్న ప్రజాదరణతో గెలుచుకున్న స్థానిక సంస్థలపై కూటమి నేతలు కన్నేసిన విషయం తెలిసిందే!. ఇటీవల బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ పదవిని తమకు 10 మంది మాత్రమే కౌన్సిలర్లున్నప్పటికీ 20 మంది ఉన్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లలో కొందరిని ప్రలోభాలతో తిప్పుకున్నారు. చైర్మన్ గిరీని అడ్డగోలుగా పొంది సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడు వైస్ చైర్మన్ పదవిని సైతం లాక్కునేందుకు సిద్ధపడ్డారు. ప్రస్తుతం వైఎస్సార్సీపీకి ఉన్న వైస్ చైర్మన్ పదవిపై అవిశ్వాస నోటీసును ఇచ్చిన టీడీపీ నాయకులు దానిని ఆ పార్టీకి చెందిన మరో వ్యక్తికి ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇక్కడి మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరగనుంది. వైస్ చైర్మన్ గొలగాని రమాదేవిపై ఆర్డీఓ జీవీఎస్ఎస్ రామమోహనరావు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరగనున్న అవిశ్వాస తీర్మానం సమావేశానికి ఇరు పార్టీలకు చెందిన కౌన్సిల్ సభ్యులు హాజరు కానున్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



తెర్లాం: కూనాయవలసలో బాలికలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ల సంఘం ప్రధాన కార్యదర్శి విజయబాబు



బొబ్బిలిరూరల్: కోమటిపల్లిలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి



బొబ్బిలి: బొబ్బిలిలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్వాడీ సిబ్బంది, బాలికలు

తెర్లాం: కిశోరీ బాలికలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మండల సర్పంచ్ల సంఘం ప్రధాన కార్యదర్శి, కూనాయ వలస సర్పంచ్ బోడెల విజయబాబు అన్నారు. కిశోరీ వికాసం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా కూనాయవలస గ్రామ సచివాల యంలో అంగన్వాడీ కార్యకర్తలు బాలికలకు వ్యాసరచన, క్విజ్, తదితర పోటీలను మంగళవారం నిర్వహించారు. విజేతలకు సర్పంచ్ చేతుల మీదుగా బహు మతులు అందజేశారు. 18ఏళ్ల నిండే వరకు వివాహాలు చేసుకోవద్దని, వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని బాలికలకు సూచించారు. కూనాయవలస, జన్నివలస అంగవాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

బొబ్బిలిరూరల్: కిశోరీ బాలికలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని, నైపుణ్యాభివృద్ధి సాధించాలని ఐసీడీఎస్ పీఓ విజయలక్ష్మి సూచించారు. కిశోరీ వికాసం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా కోమటిపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో బాలికలు,వారి తల్లిదండ్రు లు,వైద్యులు, సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. గత 11 సెషన్లలో అవగాహన కల్పించుకున్న అంశాలపై బాలికలను అడిగి తెలుసు కున్నారు. బాలికల హక్కులు, పోక్సో చట్టం, పొదుపు, వ్యాయామం, ఆరోగ్యం, విద్య, తదితర అంశాలను వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. డాక్టర్ కనకమహాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు,ఆయాలు, టీచర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ...

బొబ్బిలి: కిశోరీ బాలికల వికాసం కార్యక్రమం ముగింపు సందర్భంగా పట్టణంలోని కుమ్మరి వీధిలో ఐసీడీఎస్ పీఓ జు.విజయలక్ష్మి, సూపర్వైజర్ రాజు ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు పాటిస్తామని బాలికలతో ప్రతిజ్ఞ చేశారు. అంగన్వాడీ కార్యకర్తల సంఘ నాయకురాలు కామేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు మండల సర్వసభ్యసమావేశం

బొబ్బిలిరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్యసమావేశం బుధవారం నిర్వహించ నున్నట్టు ఎంపీడీఓ పి.రవికుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎంపీపీ శంబంగి లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభ మవుతుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

13న మెగా జాబ్ మేళా

బొబ్బిలి: పట్టణంలోని విద్వాన్ డిగ్రీ కాలేజీలో ఈనెల 13న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఆర్.మోహనరావు తెలిపారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ హైదరాబాద్కు చెందిన ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ గ్రూప్స్లో వివిధ విభాగాల్లో నియామకాల కోసం కంపెనీ సిబ్బంది ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. 2020–25 సంవత్సరాల మధ్య ఇంటర్, డిగ్రీ(బీఏ,బీకాం,బీఎస్సీ)ఉత్తీర్ణులైన నిరుద్యోగయువతను ఎంపిక చేస్తారన్నారు. సుమారు 200 మంది వరకూ ఉద్యోగులను ఎంపిక చేసే అవకాశం ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ బయోడేటా,సర్టిఫికెట్ల జిరాక్స్లు, రెండు పాస్ పోర్టు సైజ్ఫొటోలు తీసుకుని 13వ తేదీన ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

హుండీల ఆదాయం రూ.1.58 లక్షలు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ ఆలయంలో హుండీల ఆదాయాన్ని ఆలయ ధర్మకర్త వానపల్లి నర్సింగరావు, పోలిపల్లి పైడితల్లి ఆలయ ఈఓ బి.వి. మాదవరావుల సమక్షంలో మంగళవారం లెక్కించారు. నవదుర్గ ఆలయం ఈఓ పి.శ్యామలరావు మాట్లాడుతూ మొత్తం 80 రోజులకు గాను రూ.1,58,077 ఆదాయం సమకూరిందని తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు కూరాడ వెంకటరావు, భక్తులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు

రేగిడి: మండలంలోని దేవుదల, మజ్జిరాముడుపేట, అప్పాపురం తదితర గ్రామాల అంగన్వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్. నూకాలమ్మ మంగళ వారం తనిఖీలు చేశారు. రికార్డులు, కేంద్రంలో పౌష్టికాహార పదార్థాల స్టాక్ను పరిశీలించారు. చిన్నారుల ఎత్తు, బరువును కొలిచారు. అంగన్వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

పెండింగ్ రిజిస్ట్రేషన్లు పూర్తిచేయండి

రాజాం సిటీ: ఈ నెల 21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి పెండింగ్ సిటిజన్ రిజిస్ట్రేషన్లను పూర్తిచేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని కంచరాం, ఒమ్మి, గార్రాజుచీపురుపల్లి గ్రామాల సచివాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డు లు పరిశీలించి, ప్రజలు వివిధ సమస్యలపై అందించిన అర్జీల్లో ఎన్నింటికి పరిష్కారం చూపారని సిబ్బందిని ఆరా తీశారు. యోగాంధ్రలో భాగంగా మండలం లో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

మృతుడి కుటుంబానికి పరిహారమివ్వాలి

బొబ్బిలి: పట్టణంలోని గ్రోత్సెంటర్లోని బెర్రీ ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలో సోమవారం విద్యుత్ షాక్తో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి పరిహారం ఇవ్వాలని సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక గ్రోత్ సెంటర్లోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు.అందువల్లనే పరిశ్రమల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.